స్నేహితుడు నరసారావుపేట వాళ్ళు సప్తాహం కోలాహలంగా జరిగింది అన్నారు. చాటగొట్టిందాక ఉండి వెళ్ళిపోయినారు.

అంతా అయిపోయినతరువాత ఒకరోజు గోపాలంభార్య అన్నది. 'కాసులపేరు బంగారపువడ్డాణం కూడా చేయిస్తే తీరిపోయేదిగదా,' 'తొందరపడతావేమి, వెర్రిబాగులదానా! అప్పుతీరి రెండు మూడువందలు చేతులోవడ్డయ్యా. సప్తాహం కాంగా రెండేండ్లకు సరిపోయే గ్రాసంకూడా యింట్లోఉంది. ఇంతలో రెండోయజ్ఞానికి ప్రయత్నం జేస్తాను.' 'ఈదఫా గట్టి కాసులపేరు వడ్డాణం మురుగులు పోచీలు చేయించకపోతే నే నూరుకోను.”

'దైవేచ్ఛ ఎల్లాగుందోలే.'

# ఒకరోజు

ఆరోజు ఇంటికివచ్చే సరికి ఇల్లు యిల్లుగా లేక నరకంవలె ఉంది. కాంతం ముఖం మాడ్చుకొని ఒకమూల కూర్చొనియున్నది. బట్టలు ఉతకలేదు. పీటలు కడగలేదు. ఇల్లు ఊడవలేదు. ఎక్కడి వక్కడ ఒదిలేవేసింది. ఇల్లు యీరకంగా ఉండటం కాంతం ముఖలక్షణాలు అదోవిధంగా మారటంచూచి తుపాను రాబోతున్నదని గ్రహించాను. కదిలిస్తే రేగుతుందని మెదలకుండా గదిలోని కెళ్ళి పుస్తకం తెరచి ముందరవేసుకొని కూర్చొన్నాను.

అంతకుముందు రాత్రి కాంతానికి నాకు ఇంగ్లీషుపాఠం చెప్పే విషయంలో పోట్లాటవచ్చింది. స్కూలులో ఎల్లావున్నా ఇంటివద్ద భార్య అయినా పాఠం సరిగావినవోడ్డూ నేను పాఠం చెబుతుంటే పులుసులో కారం వేస్తానని పచ్చడిమీద మూతపెట్టివస్తానని వెడుతుంటుంది. నాకు కొయిను మెడవద్ద పట్టుకొని నడుముకు అరచెయ్యి: పోటీ పెట్టి కొంచెం కులుకుతూ నడవటం అలవాటు. ఆఅలవాటును కాంతం ఎల్లా వెక్కిరించిందో చూడండి!

ఆపాఠంలో ఆరోజు నాకర్మవశాత్తు టర్న్‌కోటు అనే పదం వచ్చింది. దానికి అర్థం చెబుతూ కోశములో. .రెండు రాజకీయమైన కక్షులున్నపుడు ఒక కక్షులో కొంత కాలముండి తరువాత తన మతము మార్చుకొని మరోపక్షముచేరే

వాడిని ఆభాషలో టరన్‌కోటు అంటారు అని చెప్పాను.

తరువాతమరునాడు రాత్రి టగన్‌కోటు అంటె ఏమిటి అని కాంతాన్ని అడిగాను. నాకు తెలియదని అనవచ్చునా! కూమన్నదల్లా లేచినుంచొని చిరునవ్వుతో ఆరంభించింది. ఏమిటి చేస్తుందో అని నేనూ అల్లాగేచూస్తూ కూర్చున్నాను. కోటు Turning Collar దగ్గర పట్టుకొని నడుముమీద చెయ్యేసి కులుకుతూ నడిచి ఇల్లా నడచే వారిని టరన్‌కోట్సు అంటారు అని విపరీతంగా నవ్వుతూ పాఠం వదిలేసి వెళ్ళిపోయింది. ఇంక నేనేమి పాఠంచెప్పేది. ఆరోజునుంచి ఇంగ్లీషుపాఠం చెపటం మానేశాను.

అందుచేత ఏమైన కోపం వచ్చిందా అని ఆలోచిస్తుండంగానే సన్నంగా కాంతం మొన్నకొన్న గొడుగు ఏది! అని అడిగింది. గొడుగు పోయిందని నోటితో ఎల్లా చెప్పేది. చెప్పకపోతే యివ్వాళ కాక పోతే రేపు తెలుస్తుంది. ఏమైనా కానీమని పోయింది 'అన్నాను'

పోయిందీ. నేననుకొంటునేవున్నా అయ్యొయ్యో. చక్కదనాలగొడుగుపోయిందీ. మీదగ్గర ఉండదు. పారేస్తారు తీసుకొని వెళ్లవద్దు అంటే విన్నారు? పోనీకొన్నారు. పదీ! అమ్మో! ముచ్చటయిన గొడుగు కళ్ళముందు కనబడుతుంది. ఎక్కడ పారేశారు—ఎవరి ముఖానపెట్టారో!

అయిదురూపాయల గొడుగు! రూపాయిబెట్టి రవిక కొందామంటె ప్రాణం ఒప్పదు. ఆ అయిదు రూపాయలు



బెడితే పట్టు రవిక వచ్చేదే! పదికాలాలపాటు తొడుక్కునేదాన్ని. బియ్యంకొంటే, పదిరోజులు సరిపొయ్యేవి! చింతపండు కొంటే ఆరునెలలు సరిపోయేది! రెండువీసెల నెయ్యి వచ్చేది? రెండువీసెల నెయ్యి బూడిదలో పోసినట్లేగా! అబ్బ! తలుచుకొంటె గుండెలు బద్దలవుతవి. నేనేం సంసారంజేసేది. కిరసనాయిలు డబ్బాకొనేవాళ్ళం గదా. ఆ అయిదురూపాయలు పెట్టి—ఎందుకు లెండి అనుకోటం మొన్న గూతమ్ముడు బటాణీగింజలకు కానీ అడిగితే లేదన్నారు. ఈ అయిదు రూపాయలకు ఎన్ని బటాణీలు వచ్చేవి! ఎన్ని రోజులు తినేవాడు!

అబ్బ ఎదెట్లా బోతే నేమి నామట్టుకు. నేను హాయిగా తిని కూర్చుందామంటే ఈచాకిరీతో నాప్రాణాలు తెగుతున్నవి. మోపెడుబట్టలు ఉతకాలె. ఇల్లంతా ఊడవవలె. ఏమాత్రం మన్ను వదిలేసినా చెవులు సాగదీస్తారు. గోడలు తెల్లగా ఉంచాలి. పుస్తకాలన్నీ దొంతర్లుగా బల్లమీద ఉండాలి. లాంతర్లు గ్లాసులు ఇవన్నీ శుభ్రంగా ఉండాలి.

ఇంత పెద్ద యిల్లు ఎందుకు? ఇన్ని గదులెందుకు ఏదో రెండు గదుల యిల్లు పుచ్చుకొని పడి ఉందామంటే వినరూ.

తొమ్మిదిగంటలకు వంట కాకపోతే గొంతుమీద కూర్చుంటారు స్కూలుకు వెళ్ళిపోయిన తరవాత అయినా నడుము వాలుద్దామంటే ఒంటిగంటకు తేనీళ్ళు ఎవరు తయా

రుజేస్తారు? ఆతేనీళ్ళు తాగిపోయిన తరవాత సాయంత్రం పనులు తయారవుతవి. విశ్రాంతి ఏది!

ఒక్కరోజు ఆయనను భార్యగా జేసి నన్ను భర్తను జేస్తే ఆభగవంతుడు. అప్పుడు తెలుస్తుంది ఆయనకు.

అని ఏక్ దమ్మున ఉపన్యాసం యిచ్చింది. నేను అదంతా వింటూ ఊరుకొన్నాను. కోపం కొంత చల్లారిన తరవాత

కాంతం అల్లా అంటున్నావేమి? ఇల్లు జూస్తే యింత అసహ్యంగా ఉంచావు. నువ్వు అల్లాగఉన్నావు.

నే నీచాకిరీచెయ్యలేను. గొడుగులు పాలేస్తుంటే సంసారం చెయ్యటంకష్టమే అన్నది.

గొడుగులు ఎప్పుడూ పోతవా?

అవును. ఎప్పుడూ పోనిది యీచాకిరి ఒక్కటే.

చాకిరి నీకు ఎల్లా తప్పుతుంది?

నేనూ అదే ఆలోచిస్తున్నాను. నన్నేమిచేయమంటారు. జీవితం భారం అనిపిస్తున్నది అన్నది కాంతం.

ఇంత సామాన్యంగా పోయిందానికి నాలో నేను సంతోషించాను. ఏదో భార్య సంసారం భారం అనిపించి విసుక్కున్నంత మాత్రాన నేను పాటించ నక్కరలేదనుకొన్నాను. నామాటేమిటి, సోక్రటీసు అంత వాడికి తప్పిందికాదు.

తెరచాటునుంచి ఉపన్యాసం. ఒకరోజు సోక్రటీసు ఇంటికి రావటంతోనే భార్య తిట్టడం ప్రారంభించినదట. అతను ఏమన్నా మాట్లాడక ఊరుకొన్నాడు. ఆమెకు చివరకు ప్రాణం



విసికి 'బెల్లంకొట్టిన రాయిలాగ మాట్లాడవేం అని చెంబెడు నీళ్ళు ఎత్తి అతని నెత్తినిపోసింది. అతను చాలా సంతోషించి ఆ ఉరుములకు ఘురవులకుయీకాస్తవానైనా అనుకొన్నాడట.

నేనూ అల్లాగే అంతటితో బైట పడ్డందుకు సంతోషించి "కాంతం నేనో కబురుచెబుతా వింటావు. ఒక తమాషా జరిగింది. అదంతా నీవిషయమై" అన్నాను.

'ఏమిటి—' అన్నది కాంతం.

'నీవిషయమై ఒకకథ వ్రాశాను.'

"ఏమని వ్రాశారు? ఇల్లు ఊడవదనా? లాంతర్లు శుభ్రంగా తుడవదనా? భర్తను గౌరవించదనా? కొంటెపిల్లఅని అల్లరి జంతువని గోల చేస్తుందని వ్రాసిఉంటారు. బాగా తిట్టారా మీకసితీరేటట్లుగా? ఏమివ్రాశారో చెప్పరేం.

"చెప్పమంటావా?—'

చెప్పమంటావా అంటారేమి? చెప్పివేశెయ్యండి. ఉన్నది ఉన్నట్లు పలకండి. నాతప్పులు పట్టుకోటం నన్ను తిట్టటమేగా మీరు జేసేపని—నిజం చెప్పండి నేనేమాట చెప్పకముందే అనవలసిన మాటలన్ని అనివేస్తుంటివి. విను. ఆకథలో కాంతం అంత మంచిభార్య, సుగుణవతి, ప్రేయసి, ప్రపంచకంలో లేదని వ్రాశాను అని, చెప్పవద్దూ చేసినపాపం!—ఆపళంగా ఆమెను చెక్కిలిపైని ఒక్క చిన్నిముద్దు పెట్టుకొన్నాను. సిగ్గుపచ్చింది నాకు కూడా వెంటనే అక్కడ నిలవకుండా నాగదిలోకి వెళ్ళిపోయినాను.

## ౨

పదకొండుగంటలు కొట్టటంతోనే పట్టుబట్ట కట్టుకొని భోజనానికి తయారయినాను. ఇల్లు స్వర్గతుల్యంగా ఉంది. కాంతం ముఖం కార్తిక జ్యోత్స్నలను వెదజల్లుతున్నది. దుఃఖమేఘములు పటాపంచలైపోయినవి. చెంబులు తెల్లబడి వెండిచెంబులులాగ మెరుస్తున్నవి. బట్టలు పువ్వుల్లాగ ఉతికిపెట్టింది. పీటలు కడిగింది. ఇల్లు అద్దంలాగ ఉంది. పుస్తకాలు చక్కగా బొత్తులుపెట్టి ఉన్నవి. ఎంతలో ఎంతమార్పు జరిగిందా అని ఆశ్చర్యంవేసింది. దేవతాసహాయంవల్ల జరిగిందా ఇదంతా లేక మాయా అని అనిపించింది. ఈపనిఅంతా గంటలో జరిగింది. పైగా వంట ఆరోజు చక్కగా చేసింది. కూరలు అవీ చాలా కమ్మగా ఉన్నవి.

ముకుళితకుసుమము వాయుచుంబనంచేత వికసించింది. చిరుకెరటాలను మలయపవనుడు ముద్దిట్టుకొంటే సంతోషంతో ఎగురుచున్నవి. వసంతునిచే ముద్దిడబడి పుష్పచయమంతా వికసిస్తున్నవి. ఈ చంద్రకాంతాన్ని ఏది వికసింపజేసింది? అని నాప్రశ్న.

# మరియొకరోజు

కాంతంతో ఆరోజు పోట్లాడాను. ఘోరమైన యుద్ధం జరిగిపోయింది. ఈబతుకుబతికేకంటె చావునయం అనిపించింది. చావటానికి నిశ్చయించుకొన్నాను. ఆరోజుననే నాకు లోకం మీద కూడా కోపంవచ్చింది. లోకంలో చాలామంది శత్రువులు కనిపించారు. లోకంలో సంతోషం ఇచ్చే పదార్థ ఒకటి కనిపించలేదు. మానవజన్మ దుఃఖభూయిష్ఠంగా కనపించింది. ఇంతటితో ఈ అవతారం చాలిద్దామని తోచింది.

నేనేచస్తే! మావాళ్ళంతా ఏమవుతారు! ముందుమాగోష్టి. వారికి నాచావు వజ్రాయుధంలాగ తగులుతుంది. కొంతమంది జాలిగుండె కలవాళ్ళు ఏడుస్తారు. కొంతమంది భరించి ధైర్యంతో ఊరుకొంటారు. వారంతా కలిసినప్పుడు "ఒకసోదరుడు మనలను వదిలిపోయినాడు, దుఃఖసముద్రంలో ముంచిపోయినాడు అని ఏమేమో చెప్పబోయి దుఃఖం ఆపుకోలేక భోరున ఏడుస్తారు. వాళ్ళంతా వచ్చి మావాళ్ళను ఆదరిస్తారు. నాపేరుతో ఒకచిన్న గ్రంథమండలి లేవదీస్తారు. ఒకపోటీ పరీక్షకూడా పెడితే పెట్టవచ్చు.

నాభార్య నాప్రియురాలు ఎంత ఏడుస్తుందో. దానిదుఃఖం అపారంగదా! గభీర సముద్రంలో తోసినట్లైగదా! ఆవిచారాన్ని ఎవరుచూడగలరు? నాభార్య ఏడుస్తుంటే చూచినవాళ్ళగుండెలు జారిపోతవి.